

కొద్దిరోజుల కిందట ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బొబ్బిలి యువకుడికి కిడ్నీలు రెండూ పాడయ్యాయి. అత్యవసరంగా ఒక కిడ్నీ అయినా అమర్చాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆదే సమయంలో విజయనగరంలో మృతిచెందిన ఓ వ్యక్తి అప్పటికే అవయవదానం చేయడంతో అతని కిడ్నీని బంధువుల అనుమతితో బొబ్బిలి యువకునికి అమర్చారు. దీంతో ఆ వ్యక్తి మరణించినప్పటికీ అవయవదానంతో మరో యువకుడికి ఆయువు పోషినట్లయింది. ఇదే అవగాహన ప్రతి ఒక్కరిలో కలిగితే ఎంతో మందిని అర్థాంతరంగా చనిపోకుండా కాపాడవచ్చు. ఈ నెల 13న ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



- చనిపోతూ 8 మంది జీవితం నిలిపే అవకాశం
- ప్రజల్లో కొరవడిన అవగాహన
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం
- దాతల పార్థివ దేహాలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అవయవదానం.. ప్రాణదానం



అవయవదానంతో పునర్జన్మ

బీఆర్ అంబేడ్కర్, కలెక్టర్

పునర్జన్మ కేవలం అవయవదానంతోనే సాధ్యం. మరణానంతరం కూడా మనం ఏదో ఒక రూపంలో ఎవరో ఒకరి దేహంలో జీవించే అవకాశం ఉంటుంది. చనిపోయిన తరువాత కూడా మన హృదయ స్పందన వారి దేహంలో కొనసాగుతుంది. మన నేత్రాలతో వేరే వారు ప్రపంచాన్ని చూడవచ్చు. అందుకే యువత అపోహలు వీడి అవయవదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

(విజయనగరం రింగురోడ్డు)

పుట్టిన ప్రతి మనిషికీ మరణం తప్పదు. వృద్ధాప్యం కారణంగానో.. వ్యాధుల కారణంగానో, ప్రమాదంతోనో మరణించడం సహజం. మృతిచెందిన వారి అవయవాలు దానం చేస్తే ఆ వ్యక్తి లేకపోయినా, మరో వ్యక్తి రూపంలో సజీవంగా ఉంటాడు. సాధారణంగా ఒక వ్యక్తి మరణించిన తరువాత ఆయన మృతదేహానికి బంధువులు దహన సంస్కారాలు నిర్వహిస్తుంటారు. అవయవదానంపై చైతన్యం లేక.. అవగాహన ఉండక పూర్వపు పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. అవయవదానంపై స్వచ్ఛంద సంస్థలు, ముఖ్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రభుత్వం విస్తృతంగా వివరించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అవయవాలు దానం చేయకపోవడం వల్ల, సమాజంలో చాలా మందికి అవయవాలు దొరకక జీవితమంతా జీవచ్ఛవాల్లా ఉండిపోతున్నారు.

● ఒకరి అవయవదానంతో పలువురి ప్రాణాలు కాపాడవచ్చు. ముఖ్యంగా కళ్లు, కిడ్నీలు, ఊపిరితిత్తులు, గుండె, కాలేయం వంటివి మార్పిడికి అనువైనవి.. ఒక దాత ఎనిమిది మంది ప్రాణాలు రక్షించవచ్చునని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అవయవాల వైఫల్యం కారణంగా ఏటా 5 లక్షలకు పైగా ప్రజలు మరణిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. మరణించిన వారి నుంచి కళ్లను అంధులకు అమర్చితే వారు చూపును పొందుతారు. మిగిలిన అవయవాలు బతికుండగానే మార్పిడి చేయాల్సి ఉంటుంది. రోడ్డు ప్రమాదంలో లేదా ప్రమాదం జరిగినప్పుడు వ్యక్తి తలకు బలమైన గాయం అయినప్పుడు బ్రెయిన్ డెడ్ జరుగుతుంది. అంటే వారి శరీరంలో అన్ని అవయవాలు యథావిధిగా పనిచేస్తాయి. కాని వారు పూర్తిగా కోమాలో ఉండిపోతారు.. తిరిగి రికవరీ కావడం అసాధ్యం. అటువంటి పరిస్థితుల్లో ఆ వ్యక్తిలోని ప్రధాన అవయవాలు గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం, కళ్లను దానం చేస్తే వాటి వల్ల ఇతరులకు ప్రాణభిక్ష పెట్టిన వారవుతారు.

ఎన్ని గంటల్లో అమర్చాలి

ఊపిరితిత్తులు, గుండెను ఆరు గంటల్లోపు, మూత్ర పిండాలను(కిడ్నీలు)48 గంటల్లోపు, కళ్లను ఆరు గంటల్లోపు, కాలేయాన్ని 12 గంటలలోపు వేరేవారికి అమర్చితేనే అవి యథావిధిగా పనిచేస్తాయి. ఏ ఆసుపత్రిలోనైనా బ్రెయిన్ డెడ్ అయి కోమాలో వున్నవారి అవయవాలను వారి కుటుంబ సభ్యులు దానం చేయాలంటే సంబంధిత ఆసుపత్రి నుంచి సమాచారం ఇవ్వాలి. అక్కడి నుంచి ప్రత్యేక వైద్య బృందం వచ్చి పరిశీలించి గంటల వ్యవధిలోనే కోమాలో వున్న వ్యక్తి అవయవాలను గ్రీన్ ఛానల్ ద్వారా తరలిస్తారు. ముందుగా వారి వద్ద రిజిస్టర్ అయిన వారికి అమర్చుతారు.

జీవన్‌ధాన్‌లో నమోదు చేసుకోవాలి

డాక్టర్ కె.రాంబాబు, జీవనధాన్, రాష్ట్ర కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్



అవయవదానం చేయాలనుకున్న వారు ముందుగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తమకు తెలిసిన వారందరికీ సమాచారం అందివ్వాలి. దీనివల్ల అతను చనిపోయాక అవయవదానం చేసేందుకు వీలు కలుగుతుంది. జీవన్‌దాన్ అనే కార్యక్రమాన్ని 2014 సంవత్సరంలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. విజయవాడ కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ జీవన్‌ధాన్. జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో డోనర్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

వారికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అవయవదానంతో జీవధాతలుగా నిలిచిన వారి పార్థివ దేహాలకు గౌరవ ప్రదమైన వీడ్కోలు తెలపాలని, వారి అంతిమ యాత్రను రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవయవదానం చేసిన కుటుంబాలకు రూ.10 వేల సాయం అందించనున్నారు. అవయవదాతల కుటుంబ సభ్యులను గౌరవిస్తూ వారిని ప్రశంసాపత్రం, పుష్పగుచ్ఛాలతో ప్రభుత్వం సత్కరిస్తుంది. ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించే అంతిమ సంస్కారాలకు కలెక్టర్ లేదా జిల్లా స్థాయి సీనియర్ అధికారి వెళ్లాల్సి ఉంటుంది.



అపోహలు వద్దు

డాక్టర్ భాస్కరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, విజయనగరం



అవయవదానంపై ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ చాలా మందిలో నేటికీ అవయవదానంపై అపోహలు ఉన్నాయి. అవి ఏ మాత్రం వాస్తవం కాదు. మరణానంతరం శాశ్వతంగా జీవించే మార్గం అవయవదానమే.


అవగాహన తప్పనిసరి

డాక్టరు కె.తిరుమల ప్రసాద్, ప్రముఖ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు, విజయనగరం



అవయవదానంపై ఇప్పటికీ జిల్లా వాసుల్లో చాలా అపోహలు ఉన్నాయి. దేశంలో ఏటా లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కి గురి అవుతున్నారు. వీరిలో ఒక శాతం మంది మాత్రమే అవయవదానం చేస్తున్నారు. బ్రెయిన్‌డెడ్ కేసుల నుంచి సేకరించిన కిడ్నీలు, గుండె, కళ్లను సంబంధిత వ్యాధిగ్రస్థులకు అమర్చగలిగితే మరణాలు ఆపవచ్చు.

పొలాల్లో ఏనుగుల బీభత్సం



కోదులగుమ్మడ, రాజులగుమ్మడ మధ్య తోటలో తిష్ఠ వేసిన ఏనుగులు

వంగర/ రాజాం: వంగర మండలంలోని రాజులగుమ్మడ, వీవీఆర్ పేటల్లో గ్రామ పొలిమేరల్లోకి ఆదివారం ప్రవేశించిన ఏనుగుల గుంపు సోమవారం పంట పొలాలను ధ్వంసం చేసింది. చెరకు, వరి పంటలను నాశనం చేశాయి. వీటి ఘీంకారాలతో స్థానికులు వణికిపోతున్నారు. ఏ క్షణం ఎటు వస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. బయటకు రావడానికి భయపడుతున్నారు. ఏనుగుల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ హామీ ఇచ్చారు. సోమవారం రైతులకు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. కలెక్టర్‌తో మాట్లాడి త్వరలో ఏనుగులు తరలించేలా తన వంతు కృషి చేస్తామన్నారు.

మంత్రికి విన్నపాలు



సమస్యలు వింటున్న మంత్రి శ్రీనివాస్

- కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి శ్రీనివాస్
- కిటకిటలాడిన కలెక్టరేట్ ఆడిటోరియం
- తగ్గని రెవెన్యూ సమస్యలు

కలెక్టరేట్, ఆగస్టు 12: కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర సెర్ప్, ఎన్ఆర్ఐ, చిన్న తరహాశాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వయంగా పాల్గొని జిల్లా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ అంబేద్కర్, జేసీ కార్తీక్, డీఆర్వో అనిత కూడా వినతులు తీసుకున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఈ కార్యక్రమం సాగింది. జిల్లా నలుమూలల నుంచి ఎక్కువ సంఖ్యలో ఆర్జీదారులు రావడంతో కలెక్టరేట్ ప్రాంగణం కిటకిటలాడింది. వినతులు అందజేయడానికి బారులు తీరారు. కొన్ని సమస్యలపై మంత్రి ఆయా మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్యలను వివరించారు. వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఒక దివ్యాంగుడుకి వినికిడి యంత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 287 వినతులు రాగా వీటిల్లో 187 రెవెన్యూ, డిఆర్‌డిఏకు 31, పంచాయతీరాజ్ శాఖకు 20, మున్సిపల్ శాఖకు 20 వినతులు వచ్చాయి. వాటిల్లో ఎక్కువగా భూ సమస్యలే ఉన్నాయి.

● మంత్రి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఒక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ఏ తరహా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చనే అంశంపై అధ్యయనం చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకూ చేపట్టిన హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో భాగంగా ప్రతి పౌరుడు జాతీయ జెండాను ఎగురు వేసి దేశం పట్ల భక్తిని వెల్లడించాలని మంత్రి శ్రీనివాస్ కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద జాతీయ జెండాను పట్టుకుని ఉద్యమంలో పాల్గొన్నారు.

● జాయింట్ కలెక్టర్‌గా కార్తీక్ ప్రజా సమస్యలను పరిష్కరించడంతో చక్కని శ్రద్ధ చూపారని మంత్రి శ్రీనివాస్ కొనియాడారు. జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న ఆయనను సోమవారం శాలువాతో సత్కరించారు.

కూల్చేసి.. వదిలేసి



భవనాలు కూల్చిన దృశ్యం

- ఇరుకు గదుల్లో మెంటాడ హైస్కూల్ విద్యార్థుల అవస్థలు
- రూ.1.37 కోట్లు ఏమయ్యాయో?
- ప్రారంభం కాని పక్కా భవనాల పనులు
- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

మెంటాడ, ఆగస్టు 12: మండల కేంద్రం మెంటాడ మీదుగా ఏర్పాటవుతున్న జాతీయ రహదారి పనుల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదు పక్కా భవనాలను సుమారు ఏడాదిన్నర క్రితం హైవే అథారిటీ నేలమట్టం చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో విద్యార్థి సంఘాలతో కలిసి విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేశారు. అయినా ఫలితం లేకపోయింది. నేటికీ వారికి పక్కా గూడు లేకపోయింది. ఉన్న కొద్దిపాటి ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు.

నూతన భవనాల నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని తాము భరిస్తామని హైవే అథారిటీ అధికారులు హామీ ఇవ్వడమే కాకుండా అప్పటికప్పుడు అంచనాలను రూపొందించారు. పడగొట్టిన అన్నింటికీ కలిపి కోటి 37 లక్షల 16 వేల 480 రూపాయలు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్‌కు నివేదించారు. అట్నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చాక మొత్తం 5 భవనాలు, వాటిని అనుసరించి ఉన్న షెడ్లు, పార్కింగ్ ప్రదేశం, హ్యాండ్ బోర్లు ఇలా అన్నింటినీ పూర్తిగా నేలమట్టం చేశారు.

ఇక్కడి హైస్కూల్ 1974 ప్రారంభమైంది. అప్పటి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక్క బిల్డింగుతో ప్రారంభించారు. సమీప గ్రామాలవారికి అందుబాటులో ఉన్నందున విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరగడంతో ఎప్పటికప్పుడు భవనాల సంఖ్యను పెంచుతూ వచ్చారు. అందులో ఏడాది క్రితం నిర్మించిన కొత్త భవనం కూడా ఉంది. కాగా రూపొంది ంచిన అంచనా మేరకు నేషనల్ హైవే 130 సీ డీ (ల్యాండ్ ఎంక్వైరీ) కాంపోనెంట్ అథారిటీ హోదాలో అప్పటి ఆర్డీవో ఎంవీ సూర్యకళ నిధులను విడుదల చేశారు.అయితే ఏడాది దాటినా హైస్కూల్ భవనాల నిర్మాణం పనులకు కొబ్బరికాయ కొట్టలేదు. దీంతో సుమారు 240 మంది విద్యార్థులు ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

నిధులు విడుదల చేశాం

ఎస్టిమేషన్ మేరకు నిధులు విడుదల చేశామని హైవే అథారిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పనులు ప్రారంభించే బాధ్యతను సంబంధిత అధికారులు చూసుకోవాలని పేర్కొంటున్నారు. ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి మాట్లాడుతూ కట్టిన మేరకు మరుగుదొడ్లు, బోర్లుకు బిల్లుల చెల్లింపులు జరగలేదన్నారు. టెండర్లు పిలిచి బిల్డింగ్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

నిధులు ఎక్కడ....?

హైవే అథారిటీ నిధులు విడుదల చేసినా ఇప్పటి వరకు పను లెందుకు ప్రారంభించలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరుగుదొడ్లు సగంలోనే ఆపేయడంపై మండిపడు తున్నారు. అసలు ఆ 1.37 కోట్ల నిధులు ఎక్కడు న్నాయో స్పష్టత ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది.

మరుగుదొడ్లు లేక..

విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కొన్నాళ్ల క్రితం ముందుగా రెండు హేండ్‌బోర్లును ఏర్పాటు చేసి, తర్వాత మరుగుదొడ్లు నిర్మాణాన్ని మొదలుపెట్టారు. అయితే బిల్లులు అందక సగంలోనే వదిలేశారు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు.



దిక్సూచి DIKSUCHI

ఏపీ గిరిజన వర్సిటీలో డిగ్రీ

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఏపీ సీటీయూ)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ, బీబీఏ, బీకాం ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించినసీయూఈటీ(యూజీ) 2024లో సాధించిన ర్యాంక్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి ఆనర్స్/ఆనర్స్ విత్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు.

ప్రోగ్రామ్‌లు: బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(బోటనీ), బీఎస్సీ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ(జియాలజీ), బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), బీకామ్(ఒకేషనల్).

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16
- ★ **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9
- ★ **వెబ్‌సైట్:** www.ctuap.ac.in



ఏఐసీటీఈ సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)- 'సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్'ను ప్రకటించింది. టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై దివ్యాంగులకు ఆసక్తిని కలిగించి, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. దీని ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. అభ్యర్థులు పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి మూడేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ఐటీఐ కోర్సు పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నాలుగేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. డిప్లొమా పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిగ్రీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.50,000 చెల్లిస్తారు. డిప్లొమా అభ్యర్థులకు మూడేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు నాలుగేళ్లు స్కాలర్‌షిప్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీకైతే డిప్లొమా అభ్యర్థులకు రెండేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఏటా అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ఇందుకోసం బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్ తప్పనిసరి. ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. ఏటా చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా తరవాతి సంవత్సరాలకు వీటిని కొనసాగిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/to0Hw17లో చదవండి.

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్& నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్ఎల్ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ

హైదరాబాద్-హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మోడరన్ బయాలజీకి సంబంధించిన అంశాల్లో పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్ లేదా రిమోట్ ప్రోక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని సైన్స్ విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/డీఎస్‌టీ నుంచి వ్యాలిడ్ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ లేదా డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి. ➡ **చివరి తేదీ:** సెప్టెంబరు 16

➡ **వెబ్‌సైట్:** www.ccmb.res.in

నవ్య | చిత్రజ్యోతి

అది నా దురదృష్టం



మహేశ్‌బాబు, సోనాలి బింద్రే జంటగా కృష్ణవంశీ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ సినిమా 'మురారి'. ఇటీవలే ఆ సినిమా రీ రిలీజై క్రేజీ కలెక్షన్లు సాధిస్తున్న తరుణంలో దర్శకుడు సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించారు. వారితో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "పవన్‌కల్యాణ్‌తో సినిమా చేయాలనుకున్నాను. ఆయనకు కథ కూడా చెప్పాను. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఒకవేళ ఆయనతో సినిమా చేసి ఉంటే.. అది పెద్ద హిట్టయ్యేది. ఈ విషయంలో నాది దురదృష్టం అనుకోవాలి" అని పేర్కొన్నారు. అలాగే, మహేశ్‌బాబు తనయుడు గౌతమ్ హీరోగా 'మురారి' సీక్వెల్ ఉంటుందా అని అభిమానులు ఆయన్ని అడిగారు. "ఆ సీక్వెల్ విషయం గౌతమ్ తల్లిదండ్రుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది" అని కృష్ణవంశీ బదులిచ్చారు.

లేటెస్ట్ అప్‌డేట్



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న తాజా చిత్రం ఎన్‌బీకే 109కి సంబంధించి లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. బాబీ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో ఈ సినిమా కోసం తీస్తున్న కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తయిందనీ సోమవారం సోషల్ మీడియా ద్వారా దర్శకుడు బాబీ వెల్లడించారు. 'బాలకృష్ణ ఎనర్జీనీ, అద్భుతమైన అభినయాన్ని ఈ సినిమాలో చూస్తారు. థియేటర్లలో ఆ అనుభూతి కోసం సిద్ధంగా ఉండండి' అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా టైటిల్ గురించి రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకే టైటిల్ ఎప్పుడు ప్రకటిస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చారు దర్శకుడు బాబీ. త్వరలోనే టైటిల్, టీజర్ విడుదలవుతాయని వెల్లడించారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్ నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీత దర్శకుడు.

ఏడ్చుకుంటూ ఇంటికి...

వరుస చిత్రాలతో దూసుకుపోతున్నారు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను ఆమె గుర్తుచేసుకున్నారు. "నటిగా నాకు మొదట్లో అవకాశాలు అంత సులువుగా వచ్చేవి కావు. ఆడిషన్లకు హాజరు కావడం.. అందులో సెలక్ట్ కాలేదని తెలిసి ఇంటికి ఏడ్చుకుంటూ వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ ప్రయత్నాల్లో ఉండగా.. ఓ సినిమాలో నటిగా అవకాశం రావడంతో ఎగిరి గంతేశా. కానీ ఆ ప్రాజెక్ట్ కొన్నాళ్లకే ఆగిపోయింది. ఆ తర్వాత కూడా నాకు అవకాశాలు వెంటవెంటనే ఏమీ రాలేదు. దాదాపు పాతిక ఆడిషన్లలో తిరస్కరణకు గురయ్యాను. అలా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసేదాన్ని" అని చెప్పారు.



జాతి కోసం సాహస పోరాటం



తమిళ హీరో సూర్య నటిస్తున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'కంగువ' అక్టోబర్ 10న విడుదల కానుంది. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. మెస్మరైజింగ్ మేకింగ్‌తో రూపుదిద్దుకుంటున్న 'కంగువ' ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. యుద్ధాలు, ఆక్రమణలు చేస్తూ ఎదురొచ్చిన వారిని క్రూరంగా చంపే భయంకరమైన విలన్‌గా బాబీ డియోల్ ఈ ట్రైలర్‌లో కనిపించారు. తన జాతి కోసం, తనవారి కోసం సాహసోపేతమైన పోరాటాలు చేసే ధీరుడిగా సూర్య పాత్ర ఉంది. భారీ నౌకలపై దాడి చేసే సన్నివేశాలు, హై క్వాలిటీ విజువల్ ఎఫెక్ట్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణలు నిలుస్తాయి. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మరో చిత్రం 'కంగువ' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


బట్టతలలా కనిపించాలి అంటే సరే అన్నా



'విజయవాడ రావడం చాలా హ్యాపీగా ఉంది. డైట్‌ను పక్కన పెట్టి 'బాబాయ్ హోటల్'లో ఇడ్లీలు తినేశా. నా 'అపరిచితుడు' సినిమా మిగిలిన ప్రాంతాలకంటే విజయవాడలోనే ఎక్కువ రోజులు ఆడింది మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులు ఎంత సపోర్ట్ చేస్తారో నాకు తెలుసు' అన్నారు హీరో విక్రమ్. ఆయన నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'తంగలాన్' ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మాళవిక మోహనన్, హాలీవుడ్ నటుడు డేనియల్, నిర్మాత ధనుంజయన్‌తో కలసి ప్రమోషన్స్ నిమిత్తం విజయవాడ వెళ్లిన విక్రమ్ మాట్లాడుతూ 'నేను విభిన్న పాత్రలు పోషించిన చిత్రాలన్నీ మీరు ఆదరించారు. ఈ సినిమాలోనూ కొత్తగా కనిపిస్తా. బట్టతలగా కనిపించే గెటప్‌లో కనిపించాలని దర్శకుడు పా.రంజిత్ చెప్పగానే సరేనన్నా. ఈ సినిమాలో రెగ్యులర్ ఫైట్లు, పాటలు ఉండవు. భావోద్వేగాలు బాగా ఉన్న కథ ఇది. 'తంగలాన్' మిమ్మల్ని సరికొత్త లోకంలోకి తీసుకెళుతుంది' అన్నారు.

గురువారం నాడే విడుదల

సినిమాలకూ.. శుక్రవారానికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఎన్నో ఆశలతో తెరకెక్కించిన సినిమాలను ఆ రోజున విడుదల చేసి బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు చిత్ర ప్రముఖులు. పండగ సీజన్లలో లేదా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్పించి శనివారం, గురువారం, బుధవారం వంటి ఇతర తేదీల్లో సినిమాలు విడుదలవ్వడం అరుదు. కానీ ఈ ఏడాది అనేక సినిమాలు శుక్రవారం ట్రెండ్‌ను బ్రేక్ చేసి.. గురువారాన్ని విడుదల తేదీగా మార్చుకున్నాయి.. ఆ చిత్రాలివే.











నాని నటించిన లేటెస్ట్ చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో విభిన్న కథాంశంతో తెరకెక్కిందీ చిత్రం. అధిక కోపం గల ఓ యువకుడు.. తన కోపాన్ని నియంత్రించుకోవడానికి ప్రతీ శనివారం ఏం చేశాడనేది ఈ సినిమా కథ. ఈ నెల 29న గురువారం విడుదవుతున్న ఈ చిత్రంలో నాని పాత్రలో అనేక రకాల షేడ్స్ ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇంతకు ముందు వీరి కలయికలో వచ్చిన 'అంటే సుందరానికీ' సినిమా..కమర్షియల్‌గా పెద్ద విజయం సాధించకపోయినా.. విమర్శకుల ప్రశంసలను పొందింది.

డ్యూయల్ రోల్‌లో...

తమిళ కథానాయకుడు విజయ్ డ్యూయల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). మీనాక్షీ చౌదరి కథానాయిక. వెంకట్ ప్రభు దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 5న గురువారం విడుదలవుతోంది. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలకి అధిక ప్రాధాన్యం ఉండనుంది.

వేటగాడిగా రజనీ..

'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహద్ ఫాజిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా సందర్భంగా అక్టోబరు 10న గురువారం ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మాస్ ఎంటర్టైనర్

విశ్వక్ సేన్ కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మాస్ ఎంటర్టైనర్ 'మెకానిక్ రాకీ'. సమాజంలో జరుగుతున్న ఓ కుంభకోణం నేపథ్యంలో ఈ సినిమా కథాంశం సాగనుంది. ఇందులో విశ్వక్ సరసన మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా అక్టోబరు 31న గురువారం విడుదల కానుంది.

బయోపిక్‌లో శివకార్తికేయన్

వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే తమిళ నటుడు శివ కార్తికేయన్. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న బయోపిక్ 'అమరన్' వహిస్తున్నారు. ఈ సినిమా అమరులైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబరు 31 గురువారం విడుదలవుతోంది.

'కల్కి' కూడా..

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం గురువారం రిలీజై సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం (ఆగస్టు 15)న కూడా డజనుకు పైగా చిత్రాలు సందడి చేయనున్నాయి. గురువారం సెంటిమెంటు ఈ సినిమాలకు కలసి వస్తుందేమో చూడాలి.



ప్రేమ, వినోదం.. ఉత్సవం

దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్ పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ప్రేమ, వినోదం, భావోద్వేగం.. అంశాలతో రూపుదిద్దుకొన్న కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకుడు అర్జున్ సాయి చెప్పారు. ప్రకాశ్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోందని నిర్మాత సురేశ్ పాటిల్ చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

ముఫాసా కోసం షారుఖ్



ప్రపంచ వ్యాప్తంగ ఎంతో మంది ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన 'ముఫాసా ది లయన్ కింగ్' ఫ్రాంచైజ్‌లోని కొత్త సినిమా డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సినిమా కోసం తొలిసారిగా బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ తన ఇద్దరు కుమారులతో కలసి డబ్బింగ్ చెబుతున్నారు. సినిమాలోని ప్రధాన పాత్ర ముఫాసాకు షారుఖ్ గొంతు అరువిస్తుండగా, ఆర్యన్ ఖాన్ సింబా పాత్రకి, చిన్నప్పటి ముఫాసా పాత్రకు షారుఖ్ చిన్న కుమారుడు అబ్రమ్ ఖాన్ డబ్బింగ్ చెబుతున్నారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



తన దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన సాయి కిశోర్ దర్శకుడిగా మారి రూపొందించిన 'ధూమ్‌ధాం' చిత్రం టీజర్‌ను హీరో గోపీచంద్‌తో కలసి విడుదల చేశారు దర్శకుడు శ్రీను వైట్ల. గోపీ మోహన్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించారు. ఈ సందర్భంగా నిర్మాత ఎమ్మెస్ రామ్‌కుమార్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో నాకు ఉన్న మిత్రుల్లో హీరో గోపీచంద్ ఒకరు. చక్కని ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా సినిమాను తీర్చిదిద్దాం. భారీ బడ్జెట్‌తో లావిష్‌గా నిర్మించాం. విదేశాల్లో కూడా షూటింగ్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

స్వాతంత్రం.. మా స్వాతంత్ర్యం



తన ఆహార విధానంతో ఆరోగ్య డైట్ ప్రారంభించిన లక్ష్మణ్ పూడి తన మాతృ సంస్థ ప్రజానాట్య మండలి రూపకల్పనలో ఎం. శేషగిరిరాసిన 'స్వాతంత్రం.. మా స్వాతంతీర్యం' పాటను పాడారు. శ్రీనివాస్ నందుల రాసిన ఈ పాటను తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. దేశం మీద ప్రేమతో నిరక్షరాస్యులను మేల్కొల్పడానికి ఈ పాటను రూపొందించినట్లు లక్ష్మణ్ పూడి చెప్పారు.

సీనియర్ నటుడు నరేశ్ తన యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాకీ ష్రాఫ్, పూనమ్ ఢిల్లాన్, జయసుధ, సుహాసిని, కుష్బూ, సాయి దుర్గాతేజ్, మంచు మనోజ్, నారా రోహిత్ , దర్శకుడు మారుతి తదితరులు హాజరయ్యారు. హీరో కృష్ణ, విజయనిర్మలతో ఏర్పాటు చేసిన స్ఫూర్తి వనాన్ని ఈ సందర్భంగా నరేశ్ ప్రారంభించారు.



'అతడు' సినిమా చూసేవాడ్ని



'మహారాజా' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు తమిళ నటుడు విజయ్ సేతుపతి. తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న ఆయన.. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మహేశ్‌బాబు కథానాయకుడిగా నటించిన 'అతడు' సినిమా నాకెంతో ఇష్టం. జీవితంలో ఒడిదుడుకులకు లోనైన సమయాల్లో ఆ సినిమాను రిపీట్ మోడ్‌లో చూసేవాడ్ని. ఆ సినిమాలో మహేశ్ నటన అద్భుతం. ఆయన పలికిన ప్రతీ డైలాగ్, సన్నివేశం నాకు బాగా గుర్తుండిపోతుంది. త్రివిక్రమ్ దర్శకత్వ పటిమ.. ఆయన రాసిన సన్నివేశాలతో తెరపై భావోద్వేగాలు బాగా పండాయి. ముఖ్యంగా హీరోహీరోయిన్ల కెమిస్ట్రీ, బ్రహ్మానందం కామెడీ, పాటలు నాకు బాగా నచ్చాయి" అని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కా చర్యలు

● రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: జిల్లాలోని రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రహదారి భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెల్మెట్ వాడకంపై పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించాలని వారిలో చైతన్యం తీసుకునిరావాలని కోరారు. 43 బ్లాక్ స్పాట్స్‌ను పోలీసులు, రవాణా, నేషనల్ హైవే ఆర్అండ్‌బీ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి, అక్కడ వారం రోజుల్లో ఎటువంటి చర్యలు తీసుకోవాలో అనేదానిపై నివేదిక ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని ట్రామా కేర్ సెంటర్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలో నిర్ణయించి, ఈ మేరకు ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ కార్తీక్, డీటీసీ మణికుమార్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తదితర జిల్లా అధికారులు ఉన్నారు.

15న రెవెన్యూ సదస్సులు

భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. సోమవారం సాయంత్రం మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 15న విజయనగరంలో మంత్రి చేతుల మీదుగా రెవెన్యూ సదస్సులు లాంఛనంగా ప్రారంభం అవుతాయన్నారు. 45 రోజులు పాటు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి రోజు తాను ఏదో గ్రామంలో జరిగే సదస్సుకు హాజరు అవుతాని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు సదస్సు ప్రారంభం కావాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులు పరిశీలన కోసం సీసీఎల్‌ఏ ఆర్పీ సిసోడియా ఈనెల 16న జిల్లాకు రానున్నారని, ఆయన రోజంతా ఇక్కడే ఉండి మండలాల్లో పర్యటిస్తారని చెప్పారు. ఎంపీడీవోలు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, తరుచూ గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. జిల్లాలో ఉన్న 601 ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు 211 మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బదిలీపై వెళ్తున్న జేసీకి ఘన సన్మానం

జిల్లా నుంచి బదిలీపై పై వెళ్తున్న జేసీ కార్తీక్‌ను జిల్లా రెవెన్యూ శాఖ ఘనంగా సత్కరించింది. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ జేసీ సేవలు అభినందనీయమని, ఆయన క్రమశిక్షణ, అంకిత భావం, సమయపాలన, పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అనిత, ఆర్డీవో సూర్యకళ, జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షులు తాడ్డి గోవింద తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణ నిరసనకారులతో కిటకిటలాడింది.

● జిల్లాలోని మద్యం షాపుల్లో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదని ఉద్యోగులు ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా 170 మంది సూపర్‌వైజర్లు, 420 మంది సేల్స్ మ్యాన్లు, 330 సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు చేయాలని ప్రయత్నిస్తోందని.. దీని వల్ల తమ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని.. తమను ఆదుకోవాలని ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్ డిమాండ్ చేశారు. ● 'విజయనగరం పట్టణంలోని మంగళవీధి, రంగాల వీధి, మేకల కబేళా ప్రాంతం, నాగవంశం వీధి, కమ్మవీధి తదితర ప్రాంతాలకు చెందిన రజక వృత్తిదారులు ఐదు తరాల నుంచి కొండవెలగా డకు వెళ్లే తారు రోడ్డు పక్కన పెదరేవు(చాకిరేవు)లో దుస్తులు ఉతుకుతూ జీవనం సాగిస్తున్నాం. బిట్ నెంబరు 28-1,29-2 గల సర్వే నెంబర్లలో 28 ఎక రాల 7 సెంట్ల భూమి ఉంది. దీనిని వేరే వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించడానికి ప్రయత్నం చేశారు. అధికారులు స్పందించి భూ ములకు హక్కులు కల్పించాల'ంటూ సంఘ అధ్యక్షులు ఎస్.రమణ, సభ్యులు శ్రీనివాసరావు కోరారు. ● సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునస్సమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు 2004లో ఒక రకమైన తీర్పు, 2024లో మరో రకమైన తీర్పు ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వర్గీకరణను అడ్డుకోవడానికి పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పీవీ రమణ, రవి శంకర్, రాంబాబు, ఉదయకుమార్, భీమారావు పాల్గొన్నారు. ● గ్రామంలోని చనిపోయిన వ్యక్తి పేరున మస్తర్లు వేయడం, చెరువులో పనిచేయకుండా నిధులు విత్ డ్రా చేసి అవినీతికి పాల్పడిన గంట్యాడ మండలం నరవ క్షేత్ర సహాయకురాలిపై చర్యలు తీసుకోవాలని నరవ గ్రామానికి చెందిన సుంకరి శ్రీనుతోపాటు గ్రామానికి చెందిన కొంతమంది సోమవారం రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌కు కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని భద్రమ్మ చెరువుకు సంబంధించి పని చేయకుండా పని చేసినట్లు రూ. 3,29,895లు డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటితో పాటు మరెన్నో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



ధర్నా చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

ఎస్పీని కలిసిన యశస్విని

విజయనగరం క్రైం: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లాలో పోలీసుశాఖ చేపడుతున్న చర్యలపై అభినందించారు. గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్‌ని కోరారు. ఆయను కలిసిన వారిలో విజయనగరం జనసేన పార్టీ నాయకులున్నారు.

నేడు టీడీపీ సమావేశం

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి మంగళవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో జరుగుతుందని పార్టీ నగర, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరవుతారని వెల్లడించారు.

జేఎన్‌టీయూలో గ్రంథాలయ దినోత్సవం

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డి. రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీలో సాధారణ గ్రంథాలయంతో పాటు, డిజిటల్ లైబ్రరీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముందు ఫాదర్ ఆఫ్ లైబ్రేరియన్ ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాల రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ కె.కుమార్, జీజే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పల్స్ సర్వే

బొబ్బిలి రూరల్: గొర్లెసీతారాంపురం, కాసిందొరవలస గ్రామాలలో సోమవారం జల్‌జీవన్ మిషన్ పల్స్ సర్వే డీఈ పీఎంకే రెడ్డి, జేఈ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కుళాయి కనెక్షన్లు, చేతి పంపులు పరిశీలించారు.

దశపర్ని కషాయంతో పంటలకు మేలు

సాలూరు రూరల్: దశపర్ని కషాయంతో పంటలకు మేలు జరుగుతుందని సాలూరు వ్యవసాయాధికారి అనురాధ పండా చెప్పారుఘ. మామిడిపల్లిలో సోమవారం ఆమె ఈ కషాయం తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు బూన తవుడు, తాడుతూరు ఈశ్వరరావు, తాడుతూరు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

సీతంపేట రూరల్: పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని జడ్పీ డిప్యూటీ సీఈవో కె.వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక వైటీసీలో మండలంలోని 53 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీడీవో కె.గీతాంజలి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ రాజు, ఈవోపీఆర్డీ సత్యం పాల్గొన్నారు.

నగరపాలక సంస్థకు నాలుగు వినతులు

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు నాలుగు వినతులు వచ్చాయి. నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆయా వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శానిటేషన్‌కి సంబంధించి 1, హౌసింగునకు సంబంధించి 2, ఇతర సమస్యలపై ఒకటి చొప్పున వినతులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ, ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక నిర్వహించి, ప్రజల నుంచి వచ్చిన వినతులును సాధ్యమైన త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎంహెచ్‌వో కొండపల్లి సాంబమూర్తి, ఏసీపీ అమ్మాజీ రావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై సానుకూలంగా స్పందించండి

● ఎస్పీ వకుల్ జిందాల్ ● స్పందన కార్యక్రమానికి 42 ఫిర్యాదులు

విజయనగరం క్రైం: జిల్లాలో పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి.. చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 42 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్యలను వారికి తెలియజేశారు. భూ తగాదాలకు సంబంధించి 19 ఫిర్యాదులు, కుటుంబ కలహాలకు సంబంధించి ఒకటి, మోసాలపై 8, ఇతర విషయాలకు సంబంధించి 14 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అస్మాపరహీన్, డీఎస్పీ గోవిందరావు, సీఐలు మురళి, విజయనాథ్ నర్సింహమూర్తి, ఎస్ఐ గణేష్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

ముగిసిన సంగీత ఉత్సవం

విజయనగరం రూరల్, ఆగస్టు 12: విజయనగరం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత ఉత్సవం కొత్తపేటలోని ఈ నెల 10 నుంచి రెండు రోజుల పాటు జరిగింది. ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ధవళ సర్వేశ్వర రావు, డాక్టరు మండపాక రవిలు సంగీత ఉత్సవానికి వచ్చిన సంగీత కళాకారులను సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో డాక్టరు పత్రి సతీష్‌కుమార్, డాక్టరు కె పద్మ ప్రియ, టి మహేశ్వరరావు, మోదోకుర్తి శ్రీనివాసారవు, త్రినాథరావు, ధన్వాడ ధర్మా రావు, జి వెంకటేష్, మల్లాజ్యోసుల శ్రీకాంత్ తదితరులను ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సోమయాజులు తదితరులు సన్మానించారు.



సంగీత కళాకారులు ధన్వాడ ధర్మారావును సన్మానిస్తున్న దృశ్యం

సాగు భూములకు పట్టాలివ్వాలి

మక్కువ: వెంకట భైరిపురంలో వరికండి, తదితర గిరిజన గ్రామాల్లో రెండు దశాబ్దాలుగా పేదలు, గిరిజనులు కొండపోరంబోకు, అటవీభూములను సాగు చేసుకుంటుండడంతో పట్టాలివ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు.ఈ మేరకు సోమవారం స్థానిక తహసీ ల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు భూములకు పట్టాలు ఇవ్వకపోతే ఈనెల 29న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిప త్రం అందించారు. కార్య క్రమంలో గిరిజన సంఘ నాయకులు ప్రభాకర్, సీతారాం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి నర్సాపురం పంచాయతీ సమస్యలు

రామభద్రపురం: నర్సాపురం గ్రామ పంచాయతీలో వివిధ సమస్యలపై బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు సర్పంచ్ కోట వెంకటనాయుడు సోమవారం వినతిపత్రం అందించారు. ముఖ్యంగా గ్రామంలో శ్మశానానికి వెళ్లే రహదారి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తానని బేబీనాయన హామీ ఇచ్చారని తెలిపారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

కొత్తవలస: మండలంలో ఉన్న 28 రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 16 నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ బి. నీలకంఠారావు తెలిపారు. ఈ సదస్సులు సెప్టెంబర్ 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామంలోనూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పని సర్దుబాటుపై నిరసన

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో ఫ్యాప్టో నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కాలేజీలో మండల ఉపాధ్యాయులందరూ, పని సర్దుబా టును బహిష్కరిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల విద్యాశాఖాధి కారికి వినతిపత్రం అందించారు. **జామి:** మండల విద్యాశాఖాధికారులు పని సర్దుబాటులో ఉపాధ్యాయ సంఘాల సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసు కోవాలని యూటీఎఫ్ నేతలు ఏంఈవో జయశ్రీకి సోమవారం వినతిపత్రం సమ ర్పించారు. **శృంగవరపుకోటలో..** జీవో 53 ప్రకారం ఉపాధ్యాయులకు పని సర్దు బాటు చేయాలని కోరుతూ ఫ్యాప్టో నాయకులు మండల విద్యాశాఖాధికారులు నరిసింగరావు, లక్షిలకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు.



జామిలో ఎంఈవోకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రోడ్లకు అంచనాలు రూపొందించండి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పూల్ బాగ్, గొల్ల వీధి మీదుగా దాడితల్లి అమ్మ వారి గుడి వరకు గల రోడ్డును ఎమ్మెల్యే బేబీనాయన, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, డీఈ, ఏఈలతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ రహదారుల మరమ్మతులు, నిర్మాణ పనులకు కావలసిన అంచనాలు తయారు చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. వాటిని కలెక్టర్‌కు అందజేసి, నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు.



పాడయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

ప్రిన్సిపాల్‌పై మంత్రికి ఫిర్యాదు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: మక్కువ మండలంలోని ములక్కా యవలస మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత ఇటీవల స్కూల్ కమిటీలకు జరిగిన ఎన్నికల్లో వ్యవహరించిన తీరుపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఫిర్యాదు రావడంతో ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల ఎనిమిదో తేదీన జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో పాఠశాలకు కొంతమంది విద్యార్థులు తల్లిదండ్రులు పసుపు చొక్క వేసుకుని వెళ్లడంతో ప్రిన్సిపాల్ ఆ చొక్కాతో మోడల్ స్కూల్‌కు రాకూడదని వెంటనే చొక్కా విప్పించినట్లు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు ఫిర్యాదు చేయడంతో మంత్రి మండిపడ్డారు. ఇష్టముంటే పనిచేయండి. ఇష్టం లేకపోతే వెళ్లిపోండి అంటూ దీనిపై వెంటనే దీనిపై దర్యాప్తు నిర్వహించి నివేదిక అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. ఈ విషయంపై డీఈవో ప్రిన్సిపాల్‌కు వెంటనే విద్యాశాఖ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నిధులిచ్చినా పనులు చేయరేం?

సాలూరు రూరల్, ఆగస్టు 12: సాలూరు పట్టణంలో వ్యాధుల నియంత్రణకు, పారిశుధ్య పనులకు రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణతో మాట్లాడి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రూ. 36 లక్షల నిధులు తెప్పించినా పనులెందుకు చేయడం లేదంటూ పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు ఆధ్వర్యంలో మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్లు, పార్టీ నేతలు సోమవారం గ్రీవెన్స్‌లో మేనేజర్ రాఘవాచార్యులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయన్నారు. కాలువల్లో పూడికల కారణంగా దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ పరిశుభ్రతకు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి రూ. 36 లక్షల నిధులు తెప్పించిన పనులు చేయకపోవడమేమిటని ప్రశ్నించారు. మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్లు మెయిద వైదేహి, హర్ష, కొనిసి వరలక్ష్మి, లక్ష్మోజీ, టీడీపీ నేతలు, కొనిసి చిన్ని, డబ్బి కృష్ణ, అక్కాన అప్పారావు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పట్టణం జెండా వీధిలో సోమవారం ఉత్తరాంధ్ర పురపాలక బిల్ కలెక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు జీఎం ఖాన్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

దౌర్జన్యం చేయడం తగదు

బాడంగి: మండలంలోని ఆకులకట్ట గ్రామ రెవెన్యూలో ఉన్న 23-2 సర్వే నెంబరులో గల 80 సెంట్ల భూమి కొన్న దాలమ్మకు వారసత్వంగా వచ్చింది. ఆమె భర్త మృతిచెందిన తరువాత జీవనోపాధి కోసం ఏలూరు వెళ్లిపోయింది. ఇటీవల ఆ భూమి మీదకు వెళ్లి చూడగా వేరొక వ్యక్తి సాగు చేసుకుంటున్నాడని సీపీఎం నేతలను ఆశ్రయించింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎ.సురేష్ మాట్లాడుతూ ఆ భూమిని కోన దాలమ్మకు ఇవ్వకపోతే సీపీఎం ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగిస్తామని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడుతుందని హెచ్చరించారు.

ముగడ కాలనీలో వృద్ధురాలి హత్య

బాడంగి, ఆగస్టు 12: మండలంలోని ముగడ కాలనీకి చెందిన గెద్ద కృష్ణవేణి(62)ని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. మృతురాలి కుమారుడు రాజేంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల కథనం ఇలా ఉంది. గెద్ద కృష్ణవేణి ముగడ కాలనీలో నివాసం ఉంటోంది. ఈమెకు ఇద్దరు కుమారులు కాగా వారిద్దరూ ఉద్యోగరీత్యా వేర్వేరు చోట్ల నివాసం ఉంటున్నారు. దీంతో వృద్ధురాలు ఒక్కరే ఇంటిలో ఉంటున్నారు. కాగా ఈ క్రమంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈమె ఇంటిలోకి చొరబడి, హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. అనంతరం గ్యాస్ సిలెండర్ లీక్ చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి తాళం వేసుకుని వెళ్లిపోయారు. అయితే సోమవారం ఉదయం ఇంటి నుంచి గ్యాస్‌వాసన రావడంతో చుట్టుపక్కల వారు పాలకొండలో ఉంటున్న కృష్ణవేణి చిన్న కుమారుడు నాగేంద్రకు సమాచారం అందించి తాళాలు విరగ్గొట్టి చూడగా వృద్ధురాలు విగతజీవిగా పడి ఉండడం గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సీఐ నాగేశ్వరరావు క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన రాత్రి 11 - 12 గంటల సమయంలో జరిగి ఉంటుందని తెలిపారు. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ జయంతి తెలిపారు.



కృష్ణవేణి (ఫైల్)

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

భామిని: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉ న్నాయి. మండలంలోని కీసర గ్రామానికి చెందిన జెంబో రామారావు(46) వ్యవసా య కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతరికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామారావు తరచూ మద్యం తాగి భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ మధ్యలో లక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో ఇటీవల మూడురోజుల క్రితం ఆమెను కన్నవారు తమ ఇంటికి తీసుకునివెళ్లారు. దీనితో మానసికంగా బాధపడుతూ సోమ వారం ఉదయం ఇంటి వద్దనే పురుగుల మందు తాగి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ కాంతారావు ఘటనా స్థలానికి చేరి కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.



రామారావు (ఫైల్)

నిందితుడి అరెస్ట్

సంతకవిటి: మండల పరిధిలో కొత్తూరు రామచంద్రపురం గ్రామంలో ఇటీవల దాడికి గురైన వృద్ధురాలు కాయల ఎల్లమ్మ(60) చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనలో ముద్దాయి తేగల రాము ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఎస్సై షేక్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ముద్దాయిని హత్యానేరం కింద అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

టెక్కలి: నౌపడా రైల్వేజంక్షన్ సమీపంలో సోమవారం ఓ మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి గ్రామం కస్పా వీధికి చెందిన మోనింగి మోహనరావు(56)గా రైల్వే పోలీసులు గుర్తించారు. ఈయన ఈ ప్రాంతం నుంచి విశాఖ వైపు వెళ్తూ ప్రమాదవశాత్తు పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మోహనరావు వంటమాస్టర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

పశువుల శాల దగ్ధం

భోగాపురం: పోలిపల్లి గ్రామంలో మీసాల గోవింద అనే రైతుకు చెందిన పశువుల శాల ఆదివారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయింది. పశువుల శాలలో నూతన గృహానికి సంబంధించిన కిటికీలు, తలుపులతో పాటు స్కూటీ కూడా అగ్నికి ఆహుతయ్యింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగులబెట్టి ఉంటారని బాధితుడు అనుమానిస్తున్నాడు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట రూరల్: మండలంలోని నారాయణగూడ సమీపంలో సోమవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 600 లీటర్ల పులిసిన సారా బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎస్ఐ జగదీష్‌నాయుడు తనిఖీనిర్వహిస్తున్న సమయంలో బెల్లం ఊటను గుర్తించామని పేర్కొ న్నారు. ఊటల తయారీకి సంబంధించి నిందితుని ఆచూకీ కోసం వెతుకుతున్నామని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇసుక లారీ సీజ్

రేగిడి: మండలంలో గత కొద్దిరోజులుగా మళ్లీ ఇసుక దందాలకు తెరతీస్తున్నారు. అక్రమ రవాణాపై నిఘా విభాగం చర్యలు ఒకవైపు.. ఇసుకాసురుల మధ్య విభేదాలు మరోవైపు అక్రమ రవాణాను బయట పెడుతున్నాయి. ఇటీవల వరుసగా వాహనాలు సీజ్ అవుతున్న సంఘటనలే దీనికి నిదర్శనం. గడచిన వారం రోజుల్లో ఖండ్యా, పుర్లి, తునివాడ రేవుల నుంచి వస్తున్న ఐదు ట్రాక్టర్లు సీజ్ చేయగా, తాజాగా సోమవారం తెల్లవారుజామున బూరాడ సెంటర్‌లో ఒక ఇసుక లారీని పోలీసులు సీజ్ చేశారు. ఈ లారీ జోడుబందలలో డంపింగ్ చేసిన ఇసుక తెస్తుండగా పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వీవోఏ తొలగింపు ఉత్తర్వులను రద్దు చేయాలి

శృంగవరపుకోట: మండలంలోని వసి పంచాయతీకి చెందిన వీవోఏ తొలగింపు రద్దు చేయాలని గ్రామానికి చెందిన పెద్దలు, యువత కలిసి ఎంపీపీ సోమేశ్వరరావు, ఎంపీడీవో సాంబశివరావుకు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం వీరు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. పదిరోజుల క్రితం కొత్త గ్రూపులోకి వచ్చిన అమ్మాయిని నియమించడం వల్ల డ్వాక్రా సంఘాలకు ఉపయోగం లేదని అందుకు అందరికీ నిరంతరం అందుబాటులో ఉండే గుడిశ త్రివేణిని ఉంచాలని కోరారు. మండలంలోని కొత్తూరు వీవోఏ కక్కల విజయలక్ష్మిని తొలగించడం అన్యాయమని గడిచిన 12 ఏళ్లగా పనిచేస్తున్న ఈమెను రాజకీయాలకు బలిచేయడం దారుణమని సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు.



ఎంపీపీ, ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న వసి గ్రామస్థులు

ట్రాక్టర్లకే అనుమతించండి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పట్టణ శివారులో గల ప్రభుత్వ డంపింగ్ యార్డ్ నుంచి ఇసుకను స్థానిక అవసరాల కోసం ట్రాక్టర్ల ద్వారా మాత్రమే పట్టుకెళ్లడానికి అనుమతించాలని బీజేపీ మండల అధ్యక్షులు తాడ్డి ఈశ్వరరావు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. లారీలతో మహానగరాలకు పట్టుకెళుతున్న వారిని నిలుపుదల చేయాలని కోరారు.

నేడు లెఫ్ట్ హ్యాండర్స్ డే

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, ఆయన అన్న రామ్‌నాయనదీ ఎడమ చేతివాటమే..

బొబ్బిలి: ఏటా ఆగస్టు 13న లెఫ్ట్‌హేండర్స్‌డేని నిర్వహిస్తున్నారు. ఎడమ చేతివాటం కలిగిన వారంతా ఓ వేదికపైకి వచ్చి సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నారు. వీరంతా కలిసి ప్రత్యేకంగా లెఫ్ట్ హేండర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. బొబ్బిలి పట్టణంలో ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) కూడా ఎడమ చేతివాటం కలిగిన వ్యక్తి కావడం గమనార్హం. ఆయన అధ్యక్షతన లెఫ్ట్ హేండర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడాకారుడైన బేబీనాయన రెండో అన్న రామ్‌నాయనదీ ఎడమచేతి వాటమే. బేబీనాయన పుట్టుకనుంచీ పూజలు, భోజనం, రాయడం, ఆటలాడడం, అన్నీ ఎడమ చేతితోనే.

మాస్టారును చూసి..

నా చిన్నతనంలో శ్రీకాకుళం కస్పా స్కూలులో కామేశ్వరరావు అనే మా లెక్కలు మాస్టారు ఎడమ చేతితో రాసేవారు. ఏడో తరగతి చదువుతున్నప్పుడు అది చూసి నేను కూడా ప్రాక్టీసు చేశాను. ఫుట్‌బాల్, వాలీబాల్ కూడా అలాగే ఆడేవాడిని. బొబ్బిలి రాజా కళాశాలలో 1957లో లెక్చరర్‌గా చేరిన నాటి నుంచి రెండు చేతులతో బోర్డుపై లెక్కలు రాస్తే విద్యార్థులంతా ఆశ్చర్యపోయేవారు.

-తామాడ కృష్ణమూర్తి, రిటైర్డ్ లెక్చరర్



ఎడమచేతితో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

ఎవరూ ఆక్షేపించడం లేదు

బొబ్బిలి ప్రాంతంలో నూతనంగా వ్యాపార సంస్థలను నాతో ప్రారంభించేందుకు యజమానులు తరచూ ఆహ్వానిస్తుంటారు. నాకు ఎడమ చేతివాటం ఉండడంతో అలాగే ప్రారంభోత్సవం చేస్తాను. దీనిని ఎవరూ ఆక్షేపించడం లేదు. పైగా ఇదో శుభంగా ఫీలవుతుంటారు.

-శ్రీనివాసరావు, మున్సిపల్ టీడీపీ ఫ్లోర్‌లీడరు

ఎప్పుడూ ఇబ్బంది పడలేదు

● ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖులు ఎడమ చేతివాటాన్ని కలిగి ఉన్నారు. ఎడమ చేతివాటంతో నేను ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. ఇదో ప్రత్యేక లక్షణంగా భావించేవాడిని. శంకుస్థాపనలు, ఇతరత్రా పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు కొబ్బరి కాయలు కొట్టడం, పూజలు ఎడమ చేతితో చేస్తుంటాను.

- బేబీనాయన, ఎమ్మెల్యే, బొబ్బిలి

క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు

బొబ్బిలి రాజవంశీయులైన బేబీనాయన నేతృత్వంలో గల లెఫ్ట్‌హేండర్స్ క్లబ్‌లో సభ్యునిగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తోంది.

-లంక వాసుదేవరావు, సామాజిక కార్యకర్త, బొబ్బిలి

విద్యార్థుల బాధ్యత సంక్షేమ అధికారులదే

● ఎమ్మెల్యే నాగమాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం: వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల పూర్తి బాధ్యత ఆయా సంక్షేమ అధికారులదే అని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సోమవారం భోగాపురం మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో నియోజకవర్గ బీసీ వసతిగృహాల విద్యార్థుల సీట్ల భర్తీకి సంబంధించి వసతిగృహాల సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రుల వలే చూసుకోవల్సిన బాధ్యత వార్డెన్లదే అన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తూ విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలన్నారు. భోగాపురం, పూసపాటిరేగ, మొయిద, పెదతాడివాడ, రావాడ, బొప్పడం, పెద్దూరు, అల్లూరు, గోవిందపురం వసతిగృహాల్లో సీట్ల భర్తీపై వివరించారు. పోస్టుమెట్రిక్ వసతిగృహాలు నెల్లిమర్ల బాలికల కళాశాల, పూసపాటిరేగ బాలుర కళాశాలకు సంబంధించి సీట్ల భర్తీపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఉప్పాడ అనూషారెడ్డి, వాసుదేవ రావు, ఏబీసీడబ్ల్యూవో రాజులమ్మ, జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, గుండ పు సూరిబాబు, బొల్లు త్రినాథ్, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

నెల్లిమర్ల: గ్రామ స్థాయిలో భూసమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు, వినతుల స్వీకరణ కోసం ఈనెల 16 నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బి.సుదర్శనరావు తెలిపారు. నెల్లిమర్లలోని తన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ సదస్సులు ఈనెల 16న రామతీర్థంలో ప్రారంభం అవుతాయని ఆయన తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం డి.నెలివాడలో సదస్సు ఉంటుందన్నారు. ఈనెల 17న సీతారామునిపేట, గొర్లపేట, 20న కొండవెలగాడ, 22న పారసాం, 24న బూరాడపేట, 27న టెక్కలి, ఎల్ఎన్‌పురం, 28న జరజాపుపేట, 29న కొండగుంపాం, 31న గరికిపేటలో ఈ సదస్సులు జరుగుతాయని తెలిపారు. అలాగే సెప్టెంబరు 3న మొయిద విజయరాంపురం, పూతికపేట, 5న సారిపల్లి, నీలంరాజుపేట, 6న దన్నానపేట, కోరాడపేట, 10న తమ్మాపురం, 11న నెల్లిమర్ల బయిరెడ్డి కళ్యాణ మండపం వద్ద, 12న తంగుడుబిల్లి, ఏటి అగ్రహారం, 13న సతివాడ, 17న గుషిణి, 19న అలుగోలు, మధుపాడ, 21న బొప్పడాం, పినతరిమి, 24న ఒమ్మి, 26న మల్యాడ, 28న వల్లూరు గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు తగవు


మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గజపతినగరం: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలపై రాజకీయ నాయకుల వేధింపులు తగదని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె గంట్యాడలోని మంత్రి స్వగృహం వద్ద ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ స్థానిక పరిస్థితులను పరిశీలించి, అక్కడి నాయకులు, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనసూయ, గజపతినగరం ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుభాషిణి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీలర్ల సంఘం ప్రతినిధులు

రేగిడి: పాతపద్ధతిలో సరకులు అందిస్తామన్న టీడీపీ ప్రభుత్వ ప్రకటనపై మండల డీలర్ల అసోసియేషన్ సంతోషం వ్యక్తం చేసింది. ఈ మేరకు డీలర్ల కార్యవర్గ ప్రతినిధులు సోమవారం స్థానిక సివిల్ సప్లయిస్ గొడౌన్ వద్ద చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ అధ్యక్షులు వన్నలి రామమూర్తినాయుడు, కార్యదర్శి అంబళ్ల సత్యంనాయుడు, ఉపాధ్యక్షుడు చింత సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

సంతకవిటి: యువత డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని సంతకవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.జనార్ధన్ పిలుపునిచ్చారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోఆర్డీ ఎల్.పుష్పాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు. ● **గుర్ల:** యువత సన్మార్గంలో నడుచుకోవాలని స్థానిక ఎస్ఐ భాస్కరరావు సూచించారు. సోమవారం గుజ్జంగివలస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెంచూరియన్ వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆ యూనివర్సిటీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డీన్‌లు ఎంఎల్ఎన్ ఆచార్యులు, డా.సన్ని దయాళ్, పీఎస్‌వీ రమణారావు, మురళి, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఆర్ఎస్ వర్మ, ఎన్‌సీసీ యూనిట్ అధికారి డా.సతీష్ తదితరులు పాల్గొన్నారు. ● **విజయనగరం దాసన్నపేట:** విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. సోమవారం తోటపాలెంలోని ఓ పాఠశాల ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి



త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని రాజాం రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి కోరారు. సోమవారం రాజాం పట్టణంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, ఎన్ఎస్ఎస్ పీవో భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పట్టణంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు డివిజన్ అధ్యక్షుడు వి.శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సెక్రటరీ మునకాల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని, ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు ఎస్.ప్రవీణ్, ఆర్.గౌరి, గాయత్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమణ, నోబుల్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నడవాలన్నా కష్టమే..

● అధ్వానంగా జగనన్న కాలనీల రహదారులు
● వర్షాల కారణంగా మరింత బురదమయం
● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు

జగనన్న కాలనీలకు వెళ్లే దారులు అధ్వానంగా ఉన్నాయి. కనీసం లబ్ధిదారులు, అధికారులు కూడా వెళ్లలేని స్థితిలో దర్శనమిస్తున్నాయి. ఇటీవల వర్షాల కారణంగా మరింత బురదమయంగా మారాయి. దీంతో లబ్ధిదారులు అక్కడకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

తీవ్ర అవస్థలు పడుతున్నాం

గజపతినగరం: పురిటిపెంట జగనన్న కాలనీకి వెళ్లే రహదారి బురదమయం కావడంతో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని.. అధికారులు సమస్యలపై దృష్టి సారించాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆట్టాడ లక్ష్మునాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇళ్లు మంజూరు చేసిన పాలకులు, అధికారులు కాలనీకి రహదారి సదుపాయం కల్పించకపోవడంతో ప్రస్తుతం రైల్వే అధికారులు వేసిన రోడ్డును ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


రాజాం: కంచరాం సమీప జగనన్న కాలనీకి వెళ్లే దారి ఇలా..


గజపతినగరం: బురదమయంగా జగనన్న కాలనీకి వెళ్లే దారి

ఈ రహదారికి మోక్షం లేదా?

రాజాం: కంచరాం సమీపంలో జగనన్న కాలనీ ఏర్పాటుచేసి, సుమారుగా 1,500 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఈ జగనన్న కాలనీకి వెళ్లడానికి తోటపల్లి కాలువ గట్టును నిర్ణయించారు. 40 అడుగుల వరకు రహదారి నిర్మాణం చేపట్టడానికి కలెక్టర్ రూ.2.5కోట్లు నిధులను మంజూరు చేశారు. ఈ మేరకు కాలువను ఆనుకుని ఉన్న స్థలాన్ని రైతుల నుంచి సేకరించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఈ రోడ్డుకు మట్టి పనులు మాత్రమే చేపట్టారు. వర్షం పడిందంటే కనీసం లబ్ధిదారులు, అధికారులు కాలిబాటన కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. లబ్ధిదారులు కూడా నిర్మాణ సామగ్రి తీసుకువెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి గుండా గడ్డిముడిదాం గ్రామానికి చెందినవారు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి దుస్థితి చాలా దారుణంగా ఉండటంతో వారు కూడా బుచ్చింపేట మీదగా రాజాం చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి

ఈ రహదారి విషయంలో అధికారులు చర్యలు తీసుకుని నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కాలనీ లబ్ధిదారులు, గడిముడిదాం ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

● సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ
● దిశా నిర్దేశం చేస్తున్న ఎంపీపీలు, ఉన్నతాధికారులు


గజపతినగరం: మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక


భోగాపురం: మాట్లాడుతున్న ఎంపీపీ అనూషారెడ్డి


బాడంగి: మాట్లాడుతున్న ఎంపీడీవో ఆంజనేయులు


బొండపల్లి: సూచనలిస్తున్న కృష్ణమోహన్

గజపతినగరం: పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు నిరంతరం కృషి చేయాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేయాలన్నారు. జడ్పీటీసీ గార తవుడు, ఎంపీడీవో జయింతి ప్రసాద్, ఏవో సుదర్శనం, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ● **బొండపల్లి:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో హరిహరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సహాయ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూళన, తాగునీరు, విద్యా, వైద్యం, రహదారి నిర్మాణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణాకరరావు, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ● **గుర్ల:** గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అప్పలనాయుడు, ఎంపీడీవో వెంకటరావు, వరప్రసాద్, సన్యాసినాయుడు, మండల శాఖ అధికారులు, ఈవోపీఆర్డీ గాయత్రి, మండల శాఖాధికారులు పాల్గొన్నారు. ● **భోగాపురం:** పంచాయతీ విధులు, విధానాలు, చట్టంపై ప్రతిఒక్క సర్పంచ్ పూర్తిగా అవగాహన చెందాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో పంచాయతీ విధులు, విధానాలపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈవోపీఆర్డీవో సురేష్, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు. ● **దత్తిరాజేరు:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమానికి పంచాయతీ రాజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ సోమవారం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు ఈ శిక్షణా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ● **జామి:** మండలంలోని పంచాయతీలు సంపూర్ణ అభివృద్ధి సాధించాలంటే సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి చాలా కీలకం అని జిల్లా పంచాయతీ గ్రామీణాభివృద్ధి అధికారి కె.నాగరాజు అన్నారు. సోమవారం జామిలో ఈవోపీఆర్డీ శ్రీదేవి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమలరావు, ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ సరయూ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులున్నారు. ● **కొత్తవలస:** గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఆ గ్రామ సర్పంచ్, కార్యదర్శి తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీవో రమణయ్య తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో ఉన్న సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడురోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. ● **బాడంగి:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆంజనేయులు సర్పంచ్‌లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, ఎంపీపీ గౌరి, జడ్పీటీసీ రామారావు, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ● **వేపాడ:** గ్రామ సర్పంచుల విధులు, బాధ్యతలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉన్ననాడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో నిశ్చల అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.ఉమ తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయ తీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రంమలో ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో సర్పంచులు ముఖ్య భూమిక పోషించాలని ఎంపీడీవో చుక్క ఈశ్వరమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, ఎంవోటీలు బంగార్రాజు, పార్థసారధి, హెల్త్ సూపర్‌వైజర్ నడిమింటి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటును శాస్త్రీయంగా నిర్వహించాలి

● ఉపాధ్యాయుల ఆందోళన


చీపురుపల్లి: ఎమ్మార్సీ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు


దత్తిరాజేరు: ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారంలో ప్రభుత్వం శాస్త్రీయంగా ముందడుగు వేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మండలంలోని పీఆర్టీయూ, యూటీఎఫ్ సంఘాల ప్రతినిధులు సోమవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. 117జీవో రద్దు కాకుండా సర్దుబాటును ప్రతిపాదించడం సమర్థనీయం కాదన్నారు. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గొర్లె పద్మావతి, మెండి జగన్నాథం, దువ్వాడ కృష్ణమూర్తి, రౌతు రాము తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: జీవో నెంబర్ 117 రద్దు కాకుండా సర్దుబాటును ప్రతిపాదించడం సమర్థనీయం కాదని సోమవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా సీపీఎస్ కన్వీనర్ పి.రాంప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి తాడెల రమేష్, పీఆర్టీయు నాయకులు ఆర్.శంకరరావు, డీపీఆర్టీయూ నాయకుడు ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **రామభద్రపురం:** ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే 117 జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో సర్దుబాటుపై నిర్వహించిన సమావేశాన్ని ఉపాధ్యాయులు సోమవారం బహిష్కరించారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో సోమవారం ఎంఈవో ఆమిటి తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అవసరం లేనిచోట కూడా టీచర్లను సర్దుబాటు చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయగౌరి, నాయకుడు ప్రసన్న కుమార్, ఎస్టీయు తరపున జోగారావు, ఏపీటీఎఫ్ 257 సంఘం తరపున జేసీ రాజు, ఏపీటీఎఫ్ 938 తరపున బొప్పే రవి పాల్గొన్నారు. అంతకు ముందు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవోకు అందించారు.


రామభద్రపురం: ఎంఈవో తిరుమలప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో సభ్యులు

శ్రమదానంతో పూడిక తొలగింపు


సాగునీటి కాలువలో పూడికలు తొలగిస్తున్న రైతులు

వంగర: ఎస్ఎస్ చానల్ పరిధిలో రైతులు చేయి చేయి కలిపి.. శ్రమదానం చేసి కాలువ లో సోమవారం పూడిక తీత పనులు చేపట్టారు. కోండచాకరాపల్లి, కొప్పర, బంగారువలస, మద్దివలస రైతులు శ్రమదానంతో కాలువల్లో పిచ్చిమొక్కలు తొలగించారు. మరో రెండు రోజులు శ్రమదానం చేస్తామని రైతులు తెలిపారు.

నిరుపేదలకు అన్నదానం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పట్టణంలో నేను సైతం సేవా సంస్థ ప్రతినిధులు లంక వాసు ఆధ్వర్యంలో 356వ సోమవారం ఎరుకల కాలనీలో నిరుపేదలకు అన్నదానం చేశారు. గత ఆరున్నర సంవత్సరాలుగా పట్టణంలో నేను సైతం సేవా సంస్థ వారు ప్రతి సోమవారం నిరుపేదలకు అన్నదానం చేస్తోంది.

పాఠశాలల్లో క్రీడా పోటీలు

రేగిడి: మండలంలోని 81 పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం రేగిడి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోటీలను ఎంఈఓ వరప్రసాదరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.అప్పారావు, సిబ్బంది లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. అరసాడ, వంగర తదితర గ్రామాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు 15న బహుమతులు అందజేస్తామన్నారు.


వంగర: కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు